ఆర్‌పీఎల్.. అదుర్స్

- ఆర్ట్స్ కళాశాల మైదానంలో క్రికెట్ టోర్నీ
- 40 రోజుల పాటు నిర్వహణ
- నగరంలో క్రీడా సందడి


ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరుగుతున్న ఆర్‌పీఎల్ మ్యాచ్

ప్రకాశం నగర్: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) తరహాలో రాజమహేంద్రవరం ప్రీమియర్ లీగ్ (ఆర్‌పీఎల్) సీజన్ 5 క్రికెట్ పోటీలు ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఉత్సాహంగా జరుగుతున్నాయి. సుమారు 40 రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంట్‌లో 8 రాష్ట్రాల క్రీడాకారులు హోరాహోరీగా తలపడుతున్నారు. క్రికెట్ మ్యాచ్‌లను ఆర్‌పీఎల్ చైర్మన్ అజ్జరపు వాసు ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారు.

గత నాలుగు సీజన్లతో పోలిస్తే ఈసారి మరింత ఉత్సాహంగా మ్యాచ్‌లు జరుగుతున్నాయి. అజ్జరపు లయన్స్, అభి చాలెంజర్స్, ఏఎస్‌ఆర్‌సీఏ, ఏఆర్ క్రికెట్ ఆకాడమీ, అరకు వారియర్స్, సెంటోరియన్స్ క్రికెట్ అకాడమీ, చెగువేర యూత్, క్రికెట్ స్టార్స్, లేవన్ డాక్స్, ఆర్‌ఆర్ వారియర్స్, ఎస్ఎ లేవన్ స్టార్స్, సచిన్ 11, ఎస్పీ లెవన్, టైటాన్స్, వైజాగ్ క్రికెట్ అకాడమీ, వైజాగ్ క్రికెట్ పెండర్స్, యానాం క్రికెట్ క్లబ్ తదితర 28 జట్లు తలపడుతున్నాయి. గతంలో ఆర్‌పీఎల్‌లో సత్తా చాటిన ఇద్దరు క్రీడాకారులు ఇటీవల ఐపీఎల్‌కు ఎంపికయ్యారు.

ఆటపై ఉన్న మక్కువతో

క్రికెట్ ఆట పై ఉన్న మక్కువతో క్రికెట్ ఆట పై దృష్టిసారించాను. ఆర్‌పీఎల్‌లో ఆడటం ఆనందంగా ఉంది. వర్ధమాన క్రీడాకారులకు ఆర్‌పీఎల్ వంటి క్రికెట్ టోర్నీలు ఒక మంచి వేదిక కానున్నాయి. ఇటువంటి టోర్నమెంట్‌లు క్రీడాకారుల్లో ఉండే ప్రతిభను వెలికితీసేందుకు ఉపయోగపడతాయి. క్రీడాకారులు ఇలాంటి అవకాశాలను ఉపయోగించుకోవాలి.
–నవీన్ క్రీడాకారుడు

96 మ్యాచ్‌లు

ఆర్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్ – 5లో మొత్తం 96 మ్యాచ్‌లు జరగనున్నాయి. విజేతగా నిలిచిన జట్టుకు ఆర్‌పీఎల్ 2023 ట్రోఫీని అందజేయనున్నారు. యువతను క్రీడల ద్వారా ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ టోర్నీలో వివిధ జిల్లాల, రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరుగుతున్న ఈ పోటీలను తిలకించేందుకు క్రికెట్ అభిమానులు తరలివస్తున్నారు. ముఖ్యంగా పెద్ద ఎత్తున యువత ఆర్ట్స్ కళాశాల మైదానానికి తరలి రావడంతో ఈ ప్రాంతం సందడిగా మారింది. సుమారు 40 రోజుల పాటు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఈ పోటీలు రాజమహేంద్రవరం ఖ్యాతిని మరింత పెంచే విధంగా ఉండనున్నాయి. ఇప్పటికే సాంస్కృతిక రాజధానిగా పేరు గాంచిన రాజమహేంద్రవరం, ఇకపై క్రీడా రాజధానిగా కూడా మారుతుందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

క్లుప్తంగా

రక్తదానం సామాజిక బాధ్యత


రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న సర్పంచ్ స్టాలిన్, ఇన్‌స్పెక్టర్ తిలక్

కడియం: రక్తదానం సామాజిక బాధ్యత అని వైఎస్సార్ సీపీ కడియం మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అన్నారు. జేగుపాడులోని గణేష్ సేవాసంస్థ ఆధ్వర్యంలో దివంగత సతీష్ జయంతిని పురస్కరించుకుని రక్తదానం, కంటి వైద్యశిబిరాలు నిర్వహించారు. వీటిని స్టాలిన్, కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ ప్రారంభించారు. సంజీవని బ్లడ్‌బ్యాంక్, గౌతమీ నేత్రాలయం, స్వప్నిక గ్యాస్ట్రో అండ్ లివర్‌కేర్‌కు చెందిన వైద్యులు ఈ శిబిరాల్లో సేవలందించారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. 60 మంది యువకులు రక్తదానం చేశారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మెర్నిపాడుకు చెందిన నాయకులు గారపాటి అశోక్, ఎంపీటీసీలు ఆకుల సుధాకర్, నాగిరెడ్డి రామకృష్ణ, ఉప సర్పంచ్ పాతూరి రాజేష్ పాల్గొన్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ధవళేశ్వరం: గ్రామంలోని స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో వృద్ధులకు, దివ్యాంగులకు నిత్య అన్నదాన మహాయజ్ఞ దాతలు జి.జయకుమార్, జయప్రద దంపతులు ఆదివారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జయకుమార్ మాట్లాడుతూ పోసికుమార్, సత్య దంపతులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ మాట్లాడుతూ జయకుమార్, జయప్రద దంపతులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ట్రస్ట్ సభ్యులు ముత్యాల సత్య, దుర్గ పాల్గొన్నారు.

రూ.25 వేల ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కడియం: పదో తరగతి 1986–87 బ్యాచ్ విద్యార్థులు తమ మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. వారితో కలిసి చదువుకున్న బి.సత్యమూర్తి ఇటీవల మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ మేరకు స్కూలు ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల నుంచి సేకరించిన మొత్తాన్ని ఆ కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో దిగ్గిరెడ్డి శ్రీనివాస్, ఉంగరాల వీరభద్రరావు, జంగాల సత్యనారాయణ, చిక్కాల ఏడుకొండలు, పరిమి నరేష్, పితాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

15 గోవుల దత్తత

మధురపూడి: కోరుకొండ మండలం గాదరాడలోని ఓం శివశక్తి పీఠం ఆధ్వర్యంలో ఆదివారం 15 గోవులను రైతులకు దత్తత ఇచ్చారు. పీఠం వ్యవస్థాపకుడు బత్తుల బలరామకృష్ణ, ఆయన భార్య వెంకటలక్ష్మి చేతుల మీదుగా వాటిని రైతులకు అప్పగించారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ గోసంరక్షణ పథకంలో భాగంగా గోవులను పెంచడం, వాటిని పూజించడం జరుగుతోందన్నారు. ప్రతి సంవత్సరం పాడి పశువులను రైతులకు పెంపకం నిమిత్తం ఇవ్వడం సంతృప్తికరంగా ఉందన్నారు.

నేడు స్పందన

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని సోమవారం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో యథాతథంగా నిర్వహిస్తున్నట్లు కమిషనర్ దినేష్ కుమార్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయాలని కోరారు. అలాగే డయల్ యువర్ కమిషనర్, ఫేస్‌బుక్ లైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పడాల

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సీనియర్ జర్నలిస్ట్, రచయిత, జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు ఎన్నికయ్యారు. ఆదివారం తెనాలిలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో జరిగిన రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం (అరసం) 19వ మహాసభలలో 2023–2025 సంవత్సరానికి గాను జరిగిన నూతన కార్యవర్గ ఎన్నికలలో పడాల వీరభద్రరావు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పడాల వీరభద్రరావు మాట్లాడుతూ త్వరలో తూర్పుగోదావరి జిల్లా ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) మహాసభలను నిర్వహిస్తామని ప్రకటించారు.

5న రాష్ట్ర బ్రాహ్మణ మహిళా సదస్సు


సదస్సు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: బ్రాహ్మణ మహిళల ఆర్థిక స్వావలంబన, చైతన్యం ప్రధాన అజెండాలుగా మార్చి 5న రాజమహేంద్రవరంలో రాష్ట్ర బ్రాహ్మణ మహిళా సదస్సు నిర్వహించనున్నట్లు రాష్ట్ర బ్రాహ్మణ మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్ తోలేటి శిరీష తెలిపారు. నగరంలోని కార్యాలయంలో నగర బ్రాహ్మణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు దేవగుప్తపు సూర్యలక్ష్మి అధ్యక్షతన ఆదివారం జరిగిన కార్యక్రమంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శిరీష శిరీష మాట్లాడుతూ రాష్ట్రంలోని బ్రాహ్మణ మహిళల్ని చైతన్య పరుస్తూ, ఆర్థికం ఉపాధి చేకూర్చేందుకు ఈ సదస్సులో పలు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రముఖ గాయని ఎస్పీ సుశీల, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కుమార్తె, తెలంగాణ శాసనమండలి సభ్యురాలు సురభి వాణీదేవి, శ్రీశక్తి పీఠం మాతాజీ శ్రీరమ్యానంద భారతిస్వామి ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. రాష్ట్రంలోని బ్రాహ్మణ శాసనసభ్యులు, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు తదితరులు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కొత్తపల్లి శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్రంలోని బ్రాహ్మణ మహిళా శక్తి అంతా సదస్సుకు తరలివస్తోందన్నారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ యేచూరి ప్రసన్న, నగర మహిళా ప్రధాన కార్యదర్శి కస్తూరి సూర్యకుమారి, సదస్సు కన్వీనరు కలగ ప్రభాకరమ్, జిల్లా బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాసు, రాష్ట్ర యువజన కార్యదర్శి చెరుకూరి నాగసాయి, నగర బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు దూర్వాసుల సత్యనారాయణ పాల్గొన్నారు.

వైద్యశిబిరాలతో ప్రజలకు మేలు


వేమగిరిలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- వేమగిరిలో శిబిరం ప్రారంభం

కడియం: వైద్య శిబిరాలతో ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావిపాటి రామచంద్రరావు పుట్టిన రోజును పురస్కరించుకుని వేమగిరిలోని ఆయన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎంపీ భరత్ రామ్ ఆదివారం ప్రారంభించారు. కిమ్స్ బొల్లినేని వైద్యులు కళ్లు, జనరల్, గుండె, న్యూరో తదితర రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

కంటి వైద్య పరీక్షలను అకీరా ఆసుపత్రి వైద్యులు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ కడియం మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్రస్టాలిన్, సిటీ అధ్యక్షులు అడపా శ్రీహరి, శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, పార్టీ నాయకులు మింది నాగేంద్ర, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కబేళాలో 45 ఎద్దుల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న ఎద్దులు

ధవళేశ్వరం: గ్రామంలోని క్వారీ రోడ్డు కబేళాలో 45 ఎద్దులను, రెండు కళేబరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. గోవులను వధిస్తున్నట్లు ఎస్‌పీసీఏ సభ్యులైన విజయ్‌కిషోర్, వైష్ణవ్ దినేష్ ఆదివారం ధవళేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దీంతో సీఐ మంగాదేవి కబేళా వద్దకు చేరుకుని అప్పటికే వధించిన రెండు పశు కళేబరాలను గుర్తించారు. కబేళా నిర్వాహకులు అధిక సంఖ్యలో అక్కడకు చేరడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. అక్కడ ఉన్న 45 ఎద్దులను స్వాధీనం చేసుకున్నారు. ఆ కళేబరాలకు పోస్టుమార్టానికి నిర్వహించారు. స్వాధీనం చేసుకున్న ఎద్దులను మండపేట గోసంరక్షణ కేంద్రానికి తరలించారు. ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. పశువులు తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసును సీఐ కె.మంగాదేవి ఆధ్వర్యంలో ఎస్సై క్రాంతికుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

సోషల్ మీడియా కన్వీనర్ల నియామకం

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా నియోజకవర్గ మండల కన్వీనర్లు, కో కన్వీనర్లను నియమించినట్లు పార్టీ రూరల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, పార్టీ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు తెలిపారు. ఆదివారం కన్వీనర్, కో కన్వీనర్ల జాబితాను చందన విడుదల చేశారు.

రూరల్ మండల కన్వీనర్‌గా దీపశ్రీ, కో కన్వీనర్లుగా ఇబ్రహీం, యెనుముల సాయిమనోహర్, ఎన్.సాయికుమార్, బి.ఝాన్సీ, కడియం మండల కన్వీనర్‌గా నాగిరెడ్డి మోహన్ నాయుడు, కోకన్వీనర్లుగా లావేటి రమేష్, కొప్పిశెట్టి జయప్రకాష్, బోడ అచ్యుత రామయ్య, చింతలపల్లి రాజ్‌కుమార్ నియమితులయ్యారు.

సేవా కార్యక్రమాలకు ముందుకు రావాలి

సీటీఆర్ఐ: ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలకు ముందుకు రావాలని రాజానగరం జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం (85 – 86) పిలుపునిచ్చింది. స్థానిక వీరభద్రపురంలోని వృద్ధాశ్రమంలో ఆ సంఘ ప్రతినిధులు ఆదివారం వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంలో సంఘం ప్రతినిధి పసలపూడి గణపతిరావు మాట్లాడుతూ తమ సంఘం ఆధ్వర్యంలో అనేక చారిటీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బత్తిని వినయ ప్రసాద్, సన్నిధానం శాస్త్రి, ఆశ్రమం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటిజం కేంద్రం ఏర్పాటు అభినందనీయం

ప్రకాశం నగర్: ఆటిజం తదితర సమస్యలతో బాధపడుతున్న చిన్నారుల కోసం ఆటిజం కేంద్రాన్ని ఏర్పాటుచేయడం అభినందనీయమని ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ రామారెడ్డి అన్నారు. ఆదివారం మార్వెల్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి డాక్టర్ రామారెడ్డి, డాక్టర్ గురు ప్రసాద్, డాక్టర్ పద్మజ, డాక్టర్ నాగ సత్య ప్రసాద్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ కొందరు చిన్నారులు ఎదుగుదల లోపాలతో బాధపడుతూ ఉంటారన్నారు. వారికి తొలిదశలోనే చికిత్స అందిస్తే చక్కగా అందరి పిల్లలు లాగానే ఉంటారని, అటువంటి వారి కోసం ప్రత్యేకంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

అదానీ ఆర్థిక మోసాలపై దర్యాప్తు చేపట్టాలి


బీజేపీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: అదానీ ఆర్థిక మోసాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, ఆయన ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ నగర కన్వీనర్ అత్తిలి రాజు డిమాండ్ చేశారు. ఆ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం క్వారీ ఏరియాలోని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. మోదీ, అదానీ నల్లధనం, ఆర్థిక ఒప్పందాలపై పార్లమెంటులో చర్చకు రాకుండా చేస్తున్నారంటూ ధ్వజమెత్తారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేసి తక్షణం అదానీ మోసాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా బీజేపీ పార్టీ కార్యాలయాల ఎదుట ఆమ్‌ఆద్మీ పార్టీ శాంతియుతంగా నిరసన చేపట్టిందన్నారు. అదాని వంటి ఆర్థిక మోసగాడిని మోదీ ప్రభుత్వం వెనకేసుకు రావడం అన్యాయమన్నారు. అలాగే గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ వద్ద నిరసన తెలిపారు. ఆ పార్టీ ప్రచార కమిటీ సెక్రటరీ వనుము శ్రీనివాసు, రూరల్ యూత్ సెక్రటరీ నాని, నగర కమిటీ సభ్యుడు జె.రాజు పాల్గొన్నారు.

ఘనంగా రాజమహేంద్రి ఆర్కెస్ట్రా వార్షికోత్సవం


మాట్లాడుతున్న రౌతు సూర్యప్రకాశరావు, చిత్రంలో జిత్‌మోహన్‌మిత్ర

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): దుర్గాఫణికుమార్ ఆధ్వర్యంలో రాజమహేంద్రి ఆర్కెస్ట్రా ఎందరో ఔత్సాహిక గాయకులకు ఒక వేదికగా నిలిచిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకుడు రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. ఆర్కెస్ట్రా 29వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక గౌతమీ ఘాట్‌లోని గౌతమీ వాకర్స్, యోగా వెల్ఫేర్ అసోసియేషన్ కళావేదికపై సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలలో సినిమా పాటలు, లలిత గీతాలు, భక్తి గీతాలు పోటీలు నిర్వహించారు. సాయంత్రం 6.30 నుంచి నాడు – నేడు పేరిట రాజమహేంద్రి ఆర్కెస్ట్రా కళాకారుల సంగీత విభావరి అందరిని అలరించింది. గాయకులు ఎం.దుర్గాఫణికుమార్, చంద్రకళ, కడియం ప్రసాద్, భారతి, సూర్య, నూక్యా, వీరలక్ష్మి తదితరులు పాత, కొత్త సినిమా పాటలతో ప్రేక్షకులను అలరించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో ఆర్కెస్ట్రా కళాకారులు పాటలతో అలరించడంతో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రముఖ గాయకుడు, నటుడు జిత్‌మోహన్‌మిత్ర మాట్లాడుతూ రాజమహేంద్రి ఆర్కెస్ట్రా వార్షికోత్సవం సందర్భంగా పాటలు పోటీలు నిర్వహించడం ద్వారా ఔత్సాహిక గాయకులు కావడానికి అవకాశం ఉంటుందన్నారు. గౌతమీ వాకర్స్, యోగా వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తొంటెపు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సంగీత విభావరి, పుట్టినరోజు వేడుకలకు ఈ కళావేదికను వినియోగించుకోవచ్చన్నారు. సీనియర్ గాయకులు జిత్‌మోహన్ మిత్ర, ముత్యాలపెదబాబు, ఏవీ రమణ, రత్నరాజు, వెంకటేష్, ఆనంద్, రామచంద్రరావును పట్నాల శ్రీనివాసరావు, దుర్గాఫణికుమార్ చేతులమీదుగా సత్కరించారు. అనంతరం పాటల పోటీల విజేతలకు షీల్డ్‌లు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

ప్రకాశం నగర్: ఎస్‌కేవీటీ కళాశాల 1996 – 99 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కళాశాలలో ఘనంగా జరిగింది. 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు పరిచయం చేసుకుని, పాత రోజులను గుర్తు చేసుకున్నారు. లండన్, హైదరాబాద్, చెన్నై, వైజాగ్, నెల్లూరు, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి తరలివచ్చారు. తమకు పాఠాలు చెప్పిన లెక్చరర్ దుర్గారావు సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేసిన శాకా సురేష్‌ను అభినందించారు. టి.ప్రసాద్, నారాయణ, ఉమా శంకర్, మూర్తి, రసూల్, ప్రసాద్, శ్రీనుబాబు, సత్య, ఉమ, జ్యోతి, దుర్గ పాల్గొన్నారు.

వీరభద్రుని సన్నిధికి నడక మార్గం


వంగలపూడి వద్ద గోదావరిలో దారి ఏర్పాటు చేస్తున్న పొక్లెయిన్


రామచంద్రపురం సిద్ధి వినాయక పుష్కరఘాట్ వద్ద దారి సరిచేస్తున్న దృశ్యం

సీతానగరం: మహాశివరాత్రి సందర్భంగా వంగలపూడి, రామచంద్రపురం రేవు నుంచి పట్టిసీమ వీరభద్రుని దర్శనానికి వెళ్లే భక్తులకు ఆయా పంచాయతీల ఆధ్వర్యంలో నడక మార్గం పనులు చేపట్టారు. వంగలపూడి రేవు నుంచి కిలోమీటరున్నర దూరంలో ఉన్న గోదావరి పాయలో నీరు అడుగున్నర మాత్రమే ఉన్నందున దారిని ఏర్పాటు చేస్తున్నారు. సర్పంచ్ కొంచ అన్నపూర్ణ, ఎంపీటీసీ సూరెడ్డి గంగాభవాని, వైఎస్సార్ సీపీ నాయకులు కొంచ భాస్కరరావు, పరిమి వీర్రాజు, సూరెడ్డి పోశారావు, కోనే సుబ్బారావు, కొంచ అప్పలరాజు, రంధి శ్రీనివాస్ తదితరులు ఆదివారం నదిలో ప్రొక్లెయిన్‌తో రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అన్నపూర్ణ విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 18న మహాశివరాత్రి సందర్భంగా పట్టిసీమ వీరభద్రుని దర్శనానికి తరలివెళ్లే భక్తులకు గోదావరి పాయపై నడక మార్గం ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తుల కోసం అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోని రామచంద్రపురం సిద్ధి వినాయక పుష్కర ఘాట్ వద్ద జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, గ్రామ కమిటీ చైర్మన్ గద్దె వీరన్నబాబు, పీఏసీఎస్ చైర్ పర్సన్ కొండిపాటి కోటేశ్వరరావు, రైతు సంఘం నాయకుడు మద్దిపాటి రాంబాబు ఆధ్వర్యంలో ట్రాక్టర్లు, ఎడ్లబళ్లపై భక్తులు తరలివెళ్లేందుకు వీలుగా ప్రొక్లెయిన్‌తో మార్గం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ గోదావరిలో నీరు లేనందున నేరుగా పట్టిసీమ వీరభద్రుని దర్శనానికి భక్తులు వెళ్లవచ్చన్నారు. మహాశివరాత్రి రోజున భక్తులకు భోజనం ఏర్పాట్లు చేస్తామన్నారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో జిల్లా జడ్జి నాగేశ్వరరావు


విఘ్నేశ్వరుని సన్నిధిలో రాజమహేంద్రవరం జిల్లా జడ్జి నాగేశ్వరరావు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని రాజమహేంద్రవరం జిల్లా జడ్జి నాగేశ్వరరావు ఆదివారం దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేదపండితులు వేదాశీర్వాదం పలికి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం


బాబాను దర్శించుకున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తదితరులు

మధురపూడి: కోరుకొండ మండలం బొల్లెద్దుపాలెం గ్రామంలోని సాయిబాబా ఆలయ ఆరో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబావారిని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిగింది. బొల్లెద్దుపాలెం, గరగలంపాలెం, రాఘవపురం, కోటికేశవరం గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు. ఎంపీటీసీ అల్లి సింహాచలం, వైఎస్సార్ సీపీ నాయకులు పూసర్ల మహేశ్వరరావు, డేగల వెంకట్రామయ్య, ఆలయంలో బాబా విగ్రహదాత కోనా దొర, మొని రామకృష్ణ, మంగం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధ చారిత్రక ప్రదేశాలను కాపాడుకుందాం


సమావేశంలో మాట్లాడుతున్న హరిబాబు

రాజానగరం: రాష్ట్రంలో బౌద్ధ చారిత్రక ప్రదేశాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు అన్నారు. ఆ సంస్థ జిల్లా శాఖ ఆధ్వర్యంలో లాలాచెరువులోని గోదావరి మహా పుష్కరవనంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ నేటి కాలంలో బుద్ధిజం ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. అనంతరం జిల్లాకు ఎన్నికైన నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా జంగా రాజబాబు, జనరల్ సెక్రటరీగా సునీల్ కుమార్, ఉపాధ్యక్షుడిగా కొంకి రమేష్, కోశాధికారిగా పద్మలత, ఆఫీస్ సెక్రటరీగా బాబ్జీ, సెక్రటరీలుగా చింత అనిత, జి.శ్రీనివాస్, జి.వనరాజు, కె.అరుణ్ కుమార్ బాపూజీ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జాలాది రవి కుమార్, వై.చక్రవర్తి, ఎస్.శివ ఎన్నికయ్యారు. వీరంతా బుద్ధిజం వ్యాప్తికి తోడ్పడతామని ప్రమాణం చేశారు. సమావేశంలో బీఎస్ఐ జాతీయ సెక్రటరీ ఎస్ఎస్ఆర్ భూపతి, రాష్ట్ర సలహాదారు చింతా శ్రీరామ్మూర్తి, రాష్ట్ర సెక్రటరీ మర్రి బాబ్జీ, కోనసీమ జిల్లా ఉపాధ్యక్షుడు మట్టా వెంకట్రావు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు గుప్తా శ్రీరాములు పాల్గొన్నారు.